క్లుప్తంగా

11న 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 'హ్యాపీ అండ్ ఈజీ లివింగ్' అనే అంశంపై బ్రహ్మకుమారీస్ సంస్థ మోటివేషనల్ స్పీకర్, కార్పొరేట్ ట్రైనర్ బీకే వసంత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. వివరాలకు 040- 23001234 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

బొడ్రాయి ఏర్పాటు తెలంగాణ సంప్రదాయం


బొడ్రాయి పూజల్లో పాల్గొన్న మధు

పటాన్‌చెరు టౌన్: గ్రామాల్లో బొడ్రాయిల ఏర్పాటు తెలంగాణ సంప్రదాయమని బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో బొడ్రాయి, ఉండ్రాళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు నిర్వహించడం మన ఆనవాయితీ అన్నారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు నీలం మధును సత్కరించారు. ఈ కార్యక్రమంలో శశికళ యాదవ రెడ్డి, ఎడ్ల రమేష్, ప్రకాష్, మల్లేష్, జ్ఞానేశ్వర్, పెంటయ్య, వీరేష్, రమేష్, శివ, జ్ఞానేశ్వర్, సాయి, ప్రవీణ్, వీరేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల బస్‌పాస్ మేళా



రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ సంస్థ నిర్వహించే దివ్యాంగుల బస్‌పాస్ మేళా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నిర్వహించారు. లింగంపల్లిలోని బస్‌పాస్ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ మేళాను బస్‌పాస్ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఏటీఎం మహేష్‌కుమార్ ప్రారంభించి బస్‌పాస్‌లను అందించారు. అర్హత కలిగిన దివ్యాంగులందరికీ బస్‌పాస్‌లను ఇవ్వాలన్నదే ఆర్టీసీ సంస్థ లక్ష్యమన్నారు. బస్‌పాస్ కేంద్రం అధికారులు పి మధు, బి మహేష్‌గౌడ్, పద్మావతి, అనిత పాల్గొన్నారు.

చరిత్ర పునర్నిర్మాణం జరగాలి

రాయదుర్గం: చరిత్రకారులను అత్యధికంగా కీర్తిస్తామని, చరిత్ర పునర్నిర్మాణం జరగవలసిన అవసరం ఉందని తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి కనకయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గురువారం మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం హిందీ శాఖాధ్యక్షుడు డాక్టర్ జీవీ రత్నాకర్ రచించిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామయోధుడు మాతాదీన్, హిందీ అనువాదం కుసుమ ధర్మన్న గ్రంథాలను అవిష్కరించారు.భారత దేశంలోని భిన్న జాతుల సంస్కృతులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. హెచ్‌సీయూ తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఝుల్కారీబాయ్‌జీవిత చరిత్రను తెలుగువారికి పరిచయం చేసిన డాక్టర్ జీవిరత్నాకర్ ప్రస్తుతం మాతాదీన్‌భంగి జీవితాన్ని పరిచయం చేయడం ద్వారా దళిత, బహుజన, గిరిజన యోధులు పోషించిన పాత్ర ప్రస్తుత తరానికి తెలుస్తుందన్నారు. రచయిత డాక్టర్ జీవిరత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.


నరేంద్ర మోదీతోనే సమగ్ర అభివృద్ధి

హఫీజ్‌పేట్ : భారతదేశం ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే సమగ్ర అభివృద్ధి చెందుతోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న విశేష్ జనసంపర్క్ అభియాన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం సాధించిన ప్రగతి, అభివృద్ధి తదితర అంశాలపై గురువారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో బీజేపీ చేవెళ్ళ పార్లమెంట్ బోర్డు సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం 9 సంవత్సరాలు ఏర్పాటైన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సురక్షితమైన సరిహద్దులు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తీసుకువచ్చిందన్నారు. మోదీ ప్రభుత్వం సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే నినాదంతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, సామ రంగారెడ్డి, బొక్క నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిల్పారామం.. కళా వైభవం

- శిల్పారామంలో అద్భుతంగా చేనేత ఉత్పత్తులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గృహాలంకరణ వస్తువులు
- సీసాలపై అందమైన పెయింటింగ్స్, ఆకర్షణగా జ్యూట్‌బ్యాగ్స్
- ఆకట్టుకుంటున్న డ్రెస్‌మెటీరియల్స్
- ఈనెల 11 వరకు ప్రదర్శన



ఆకట్టుకుంటున్న రాళ్ళపై పెయింటింగ్ వేసిన ఉత్పత్తులు, వివిధ ఆకృతులలో క్యాండిల్స్

మహిళలు రూపొందించిన ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో మహిళా పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. దాదాపు 112 స్టాల్స్‌లో వినూత్న పద్ధతిలో తయారు చేసిన చేనేత ఉత్పత్తులు నగరవాసులకు అందుబాటులో ఉంచారు. 7రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో లైవ్ పెయింటింగ్, బ్యాగ్స్, రాతితో తయారు చేసిన గృహాలంకరణ ఉత్పత్తులు, పనికిరాని సీసాలపై పెయింటింగ్స్ స్టాల్స్‌లో ప్రత్యేక అకర్షణగా నిలుస్తున్నాయి.

– మాదాపూర్

- మహిళా పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన ఉత్పత్తులలో రూ.60 నుండి రూ.వేల వరకు గల ఉత్పత్తులు కొలువుదీరాయి.
- లంచ్ బ్యాగ్స్, ఆఫీస్ బ్యాగ్స్, స్కూల్‌బ్యాగ్స్, ల్యాప్‌టాప్ బ్యాగ్స్‌తో పాటు వివిధ రకాల డిజైన్లతో కూడిన బ్యాక్స్ స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయి.
- ఉపయోగంలోలేని సీసాలపై అందమైన పెయింటింగ్ చిత్రాలను వేసి అమ్మకాలు చేస్తున్నారు. ధర రూ.100 నుండి ప్రారంభం.
- మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.
- మహిళలు ఇంట్లోనే తమ ఉత్పత్తులు తయారు చేసుకుని అమ్మకాలు చేసుకోవచ్చు.
- ప్రదర్శనలో భాగంగా సందర్శకులను ఆకట్టుకునేందుకు ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ, పేరిణీ నాట్యంతో పాటు సంగీత కచేరీలను ఏర్పాటు చేసి సందర్శకులను అలరిస్తున్నారు.
- ప్రదర్శనను ఉదయం 10గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.


జోహ, ఆర్టిస్ట్


పెయింటింగ్స్.

ఎమ్మెల్యే సహకారంతో కొండాపూర్ అభివృద్ధి


మార్తాండనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ హమీద్‌పటేల్

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ సహకారంతో కొండాపూర్ డివిజన్ సమగ్ర అభివృద్ధి వైపు బాటలు వేస్తోందని కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ పేర్కొన్నారు. మార్తాండనగర్‌లో రూ.33 లక్షలతో గణేష్ టెంపుల్ వెనుక ఉన్న రెండు వీధులలో రూ.32 లక్షలతో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపూర్ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

మార్తాండనగర్‌లో కార్పొరేటర్ పర్యటన

మార్తాండనగర్‌లో కార్పొరేటర్ హమీద్‌పటేల్, ఎలక్ట్రికల్ ఏఈ రాజేందర్‌తో కలిసి పర్యటించారు. అవసరమైన చోట్లలో వెంటనే త్రీ ఫేజ్ లైన్ల ఏర్పాటు చేయాలని సూచించారు.

పెయింటింగ్, రంగోలీ పోటీలు అదుర్స్


రంగోలీ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

- హెచ్‌సీయూలోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహణ
- 'జనభాగదారి పక్షం' పేరిట 15 రోజుల


పోస్టర్ తయారు చేసి ప్రదర్శిస్తున్న విద్యార్థిని

రాయదుర్గం: విద్యార్థుల ప్రతిభ అదుర్స్ అనిపించింది. చిత్రలేఖనం, రంగోలిలో రంగురంగుల చిత్రాలు, పర్యావరణం, జంతువులు, పక్షుల పరిరక్షణ, ఇతర పలు అంశాలపై వారు గీసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతేకాకుండా విద్యార్థినులు రంగురంగులతో వేసిన ముగ్గులు కూడా అందరినీ ఆకర్షించాయి. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని కేంద్రీయ విద్యాలయలో 'జనభాగదారి పక్షం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీ వరకు నిర్వహిస్తారు. ముఖ్యంగా పోస్టర్ల తయారీ, ఆకట్టుకునే నినాదాలు, ఉపన్యాసాలు, రంగోలీ, చిత్రలేఖనం వంటి అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నారు. కేంద్రీయ విద్యాలయలోని 8,9,10 తరగతి చదివే విద్యార్థులకు నూతన జాతీయ విద్యా విధానం, పర్యావరణ పరిరక్షణ, జీ–20 దేశాల గ్రూపు అధ్యక్షస్థానంలో భారత్ పాత్ర అనే అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మిత్రబింధరావు ప్రారంభించారు. ఈ సందర్భం గా మిత్రబింధరావు మాట్లాడుతూ విద్యార్థులలో చదువుతోపాటు ఇతర రంగాలలో రాణించేలా, ప్రతిభ చాటే లా తయారు చేయడం కోసమే అన్ని రకాల పోటీలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన


భవన నిర్మాణ పనుల ప్రారంభంలో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని మార్తాండనగర్‌లో మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి కోసం రూ.21 లక్షల ఎమ్మెల్యే నిధులతో చేపట్టే పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యతతో కూడిన భవనాన్ని నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని సంఘం సభ్యులకు వారు సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లతో పాటు కొండాపూర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కార్పొరేటర్లు హమీద్‌పటేల్, జగదీశ్వర్‌గౌడ్, హఫీజ్‌పేట్ మున్నూరుకాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకూలిన చెట్లు

రహదారిపై ట్రాఫిక్ జామ్... జేసీబీతో కొమ్మల తొలగింపు


జేసీబీతో చెట్ల కొమ్మలను తొలగింపజేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి నోవాపాన్ సమీపంలోని ఎల్లమ్మ దేవస్థానం నుంచి శంకరపల్లి వెళ్లే రహదారిపై చెట్లు, వాటి కొమ్మలు రహదారిపై పడ్డాయి. దీంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. రహదారి రెండు వైపులా కూడా పడిన చెట్ల కొమ్మలతో రోడ్డు మూసుకుపోవడంతో సర్వీసు రహదారి మీదగా వాహనదారులు వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలోని ట్రాఫిక్‌లో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సిబ్బంది విరిగిన చెట్లు, కొమ్మలను జేసీబీతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసేలో ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బంది నిమగ్నమయ్యారు.

గీతం విద్యార్థికి హార్వర్డ్ వరల్డ్ రికార్డ్


విద్యార్థి దేవరాజు వంశీ కృష్ణంరాజు

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో సీఎస్ఈ రెండో ఏడాది చదుతున్న విద్యార్థి దేవరాజు వంశీ కృష్ణంరాజు అరుదైన ఘనత సాధించి హార్వర్డ్‌ను ఆకర్షించారు. 'అధ్విక' పేరుతో కృత్రిమ మేధ (ఏఐ) సంభాషణ బాట్‌పై చేసిన కృషికి హార్వర్డ్ వరల్డ్ రికార్డ్స్ లండన్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ విషయాన్ని గీతం అధ్యాపకులు డాక్టర్లు అనిత, త్రినాథరావులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.అధ్విక కృత్రిమ మేధ సంభాషణ బాట్ అనేది సహజమైన, ఆకర్షణీయమైన సంభాషణలను సులభతరం చేయడానికి అత్యాధునిక సాంకేతికను ప్రభావితం చేసే ఒక గొప్ప ఆవిష్కరణ. మన పనులను నిర్వహించే విధానంలో విప్లవాత్మక మార్పులు చేయడానికి, ఉత్పాదకతను పెంచడానికి రూపొందించినట్లు వివరించారు. హార్వర్డ్ వరల్డ్ రికార్డ్ పొందిన వంశీ కృష్ణంరాజును గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఏ ప్రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రామశాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామయ్య, సీఎస్ఈ విభాగాధిపతి సుదీప్ సుకుమారన్ కడవిల్, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులు ప్రశంసించినట్లు పేర్కొన్నారు.

మల్లన్న ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పటాన్‌చెరు: నియోజకవర్గంలో పరమత సహనాన్ని పెంపొందిస్తూ దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని క్యాసారంలో నూతనంగా నిర్మించి తలపెట్టిన మల్లికార్జునస్వామి దేవాలయ నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు నూతన దేవాలయాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు దశరథ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ పెంటయ్య, బీడీఎల్ సీఐ వినాయక రెడ్డి, ఎంపీటీసీ రామచందర్, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అనుమానాస్పదంగా తల్లీకుమారుడు మృతి


మృతురాలు ముక్రాబాయి సత్యాజీ కాంబ్లే


ఉత్తమ్ సత్యాజీ నాగప్ప కాంబ్లే

పటాన్‌చెరుటౌన్: అనుమానాస్పదంగా తల్లి కుమారుడు ఇద్దరు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌కు చెందిన ముక్రాబాయి సత్యాజీ కాంబ్లే ఆమె కుమారుడు ఉత్తమ్ సత్యాజీ నాగప్ప కాంబ్లే పదేండ్ల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి మండల పరిధిలోని రుద్రారంలో నివాసం ఉంటున్నారు. ఉత్తమ్ స్థానికంగా ఉన్న తోషిబా పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం ఇంటి తలుపులు తెరవకపోవడంతో చుట్టూ పక్కలవారు అనుమానం వచ్చి వారు ఉంటున్న గదికి వెళ్లి చూసేసరికి ఇద్దరూ చనిపోయి ఉన్నారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లీకొడుకులు ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారా, లేదా ఏ ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తెలిపిన మేరకు.. రామచంద్రాపురం మండల పరిధిలోని ఈదుల నాగులపల్లి సమీపంలో రెండు రోజుల క్రితం 30 నుంచి 40 ఏండ్ల వయస్సు కలిగిన ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసులు ఎండీఆర్ ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, సభ్యులు కలసి గురువారం మృతదేహనికి పటాన్‌చెరులో అంత్యక్రియలు నిర్వహించారు.

బాలిక అదృశ్యం


ప్రియ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ చిన్నారి అదృశ్యమైన సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండలగూడలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన సితేందర్–సునీతాదేవి దంపతులు జీవనోపాధికి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండలగూడకు వలస వచ్చారు. వీరికి ముగ్గురు సంతానం, కాగా వీరు ఉదయం 9గంటలకు ఇంటి నుంచి కూలీ పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం 6గంటలకు ఇంటికి వస్తారు. ఈ నెల 5వ తేదీన ఎప్పటిలాగే కూలీ పనులకు వెళ్లి వచ్చారు. ఆ సమయంలో రెండవ కుమార్తె 8 ఏళ్ల ప్రియ ఇంట్లో లేకపోవడంతో ప్రియ ఎక్కడ ఉందని కుమారుడిని అడగగా అతడు ఆడుకోవడానికి వెళ్లిందని సమాధానం ఇచ్చాడు. రాత్రి అయినా ప్రియ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టూ పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఊరూరా చెరువుల పండుగ



హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కొత్తకుంట చెరువు వద్ద ఊరూరా చెరువుల పండుగ నిర్వహించారు. ఈ చెరువుల పండుగకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజవకర్గం కార్పొరేటర్లు, స్థానిక ప్రజలతో ఆయన కలిసి డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారులతో కలిసి చెరువు కట్టుకు ఊరేగింపుగా వెళ్ళి కట్ట మైసమ్మ తల్లికి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కలు నాటి సభా ప్రాంగణంలో గోరేటి వెంకన్న రాసిన చెరువోయి...మా ఊరి చెరువు అనే బతుకమ్మ పాటలను వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కెసిఆర్ తీసుకువ్చిన మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 63 చెరువులు ఉన్నాయని, నా స్వంత నిధులతో దత్తత తీసుకొని చెరువులను అభివృద్ధి చేశామన్నారు. శేరిలింగంపల్లి మండల తహశిల్దార్ వంశీ మోహన్, జీహెచ్ఎంసీ డిప్యూటి కమిషనర్లు వెంకన్న, సుధాంషు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలం

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాలనీలు,బస్తీలలో మౌలిక వసతుల కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని ప్రేమ్‌నగర్ ఏ బ్లాక్‌లో గడపగడపకూ బీజేపీ 49వ రోజు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి వెళ్ళి బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రతి కాలనీ, బస్తీలో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు బాలాజీ, రంగన్న పాల్గొన్నారు.